అన్నోన్ ప్రాపర్టీ కింద గుర్తించిన వాహనాలకు 26న వేలం పాట : సిపి

సిద్దిపేట రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త : అన్నోన్ ప్రాపర్టీ కింద జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో 217 మోటారు సైకిళ్లు, 20 అటోలు, 3 నాలుగు చక్రాల వాహనాలు మొత్తం 240 వాహనాలపై కేసు నమోదు చేయడం జరిగిందని సీపీ శ్వేత శనివారం తెలిపారు. గత అరు నెలల నుంచి పై వాహనాల కోసం ఎవరూ రానందున అన్నోన్ ప్రాపర్టీగా పరిగణించి వేలం వేయడం జరుగుతుందన్నారు. ఈనెల 26 ఉదయం 11 గంటలకు చిన్నకోడూరు మండల పరిధిలోని పెద్దకోడూరు గ్రామ శివారులో గల సిఎఆర్ హెడ్ క్వార్టర్‌లో వేలం వేయడం జరుగుతుందని సీపీ శ్వేత తెలిపారు. అసక్తిగల వారు వేలం పాటలో పాల్గొని వేలం పాట ద్వారా వాహనాలు స్వాధీనం చేసుకున్న తర్వాత డబ్బులు చెల్లించి వాహనాలను తీసుకవెళ్లాలన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు అధార్‌కార్డు,ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పోలీస్ కంట్రోల్ రూం 8333998699, 9440504908, 9550936373 నంబర్లను సంప్రదించాలన్నారు.

చిమ్నాపూర్‌లో ఆర్ఎంపి క్లీనిక్ సీజ్

కంది, డిసెంబరు 17, ప్రభాతవార్త: మండలంలోని చిమ్నాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఆర్ఎంపి క్లీనిక్‌ను డిఎంఆండ్‌హెచ్ఓ డాక్టర్ గాయత్రీ దేవి సీజ్ చేశారు. శనివారం గాయత్రి దేవి గ్రామానికి చేరుకుని గ్రామంలోని ఐఐటీ వర్కర్స్ కాలనీలో నిర్వహిస్తున్న క్లీనిక్‌ను ఆమె పరిశీలించి సీజ్ చేశారు.

ఆర్ఎంపి క్లీనిక్‌ను సీజ్ చేస్తున్న డిఎంహెచ్ఓ గాయత్రిదేవి

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ తదితరులు

పోలీసుల ఎంపికకు పకడ్బంధీగా ఏర్పాట్లు : సీపీ

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి : పోలీసు ఎంపిక ప్రక్రియ పకడ్బంధీగా నిర్వహించడానికి జిల్లాలో పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు సీపీ ఎన్.శ్వేత తెలిపారు. శనివారం పోలీసు పెరేడ్ మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22 నుంచి జనవరి 3 వరకు పది రోజుల పాటు జిల్లాలో పోలీసు అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు పోలీసు మైదానంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా దేహదారుఢ్య పరీక్షలు నిఘా నీడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9, 983 మంది అభ్యర్థులకు శారీరక దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో సర్వం సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ఎంపిక ప్రక్రియలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ వెంట్స్‌లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో6 పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. మైదానంలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. దళారుల మోసపూరిత మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దన్నారు. అమె వెంట అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్, పోలీసు అధికారులు సుభాష్‌చంద్రబోస్, శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, రఘుపతిరెడ్డి, తిరుపతి, వెంకటరమణ, నిరంజన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యంగా ప్రయత్నం చేయాలి

-మంత్రి హరీష్‌రావు సహకారంతో ఫైనల్ టెస్ట్‌కు శిక్షణ

-సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

పరీక్షల్లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న సిపి శ్వేత

గజ్వేల్, డిసెంబర్ 17 (ప్రభాతవార్త): పోలీస్ కానిస్టేబుల్ మరియు ఎస్ఐ ప్రిలిమనరీ పరీక్షల్లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ కార్యాలయం వెనుక ఉన్న మైదానంలో అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత ఫిజికల్ ట్రైనింగ్ శిక్షణ శిబిరాన్ని శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి హరీష్‌రావు సహకారంతో కానిస్టేబుల్, ఎస్ఐ ప్రిలిమనరీ టెస్ట్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, చేర్యాలలో ఫిజికల్ ట్రైనింగ్ శారీరక దృఢత్వ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎలాంటి మానసిక ఆందోళన చెందకుండా పట్టుదల, కృషితో గెలవాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. ప్రతిరోజు 8 గంటలు తప్పకుండా నిద్ర పోవాలని, ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తున్న అభ్యర్థులు ఆహార ప్రామాణికలు పాటించాలని, ఇంట్లో వండిన ఆహారం మాత్రమే తినాలని సూచించారు. ఆహార నియమాలు పాటించకపోతే మీరు కష్టపడ్డ శ్రమ అంతా వృధా అవుతుందన్నారు. ఉదయం లేవగానే గ్లాస్ వేడి నీళ్ళు తీసుకోవాలని, శారీరక దృఢత్వానికి నానబెట్టిన శనగలు, పెసర్లు, ఉడకబెట్టిన కోడిగుడ్లు, డ్రైఫ్రూట్స్, రాగి జావ తీసుకోవాలని, సాధ్యమైనంత వరకు శాఖాహారం భోజనం చేసి అందులో ఆకుకూరలు ఉండేట్లు చూసుకోవాలన్నారు. అభ్యర్థులు క్రమం తప్పకుండా ప్రతి రోజు గ్రౌండ్‌కు తప్పనిసరిగా రావాలని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు.

మోసపూరిత మాటలు నమ్మవద్దు

ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని లేదా క్వాలిఫై చేయిస్తామని మిమ్మల్ని ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే అలాంటి మోసపూరిత మాటలు నమ్మవద్దని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే చీఫ్ సూపరింటెండెంట్‌కు సమాచారం అందించాలని లేదా 08457-226333 నెంబర్‌కు ఫోన్‌చేసి తెలపాలన్నారు. అత్యంత పారదర్శకంగా జరుగుతున్న ఈ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేదని అభ్యర్థులకు తెలియజేశారు. పోలీస్ ఎంపిక ప్రక్రియ మొత్తం పారదర్శకంగా కొనసాగుతుందని, ప్రతి అంశం టెక్నాలజీతో ముడిపడి ఉంటుందన్నారు. ప్రతి బ్యాచ్ ఎంపిక ప్రక్రియ జరిగే సమయంలో ప్రతి అంశం సిసి కెమెరాలో రికార్డు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ మహేందర్, గజ్వేల్ ట్రాఫిక్ సిఐ తిరుపతి, ఎస్ఐ నరేష్, ఆర్ఎస్ఐ బాలకృష్ణ, ప్రభుత్వ పిఈటిలు ఎలియాస్‌రావు, శివప్రసాద్, నగేష్, అనంతచారి పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పనులు ఈ నెల చివరి కల్ల పూర్తి చేయాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి : మన ఊరు మన బడి పనులు ఈనెల చివరి కల్లపూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను అదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం సిద్దిపేట, హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మన ఊరు మనబడి పథకంలో కేటాయించిన పాఠశాలలో జరుగుతున్న పనులపై మున్సిపల్ కమీషనర్లు, ఎంఈఓలు, ఇంజనీరింగ్ అధికారులు, ఈఈ, డీఈ, ఎఈలు, కౌన్సిలర్లు తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హుస్నాబాద్ మున్సిపాలిటీలో పాఠశాలల పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని కమిషన్, ఎంఈఓకు సూచిం చారు. ఇసుక కోరత ఉందని కాంట్రాక్టర్ తెలుపగా సమస్యను అర్డీఓ పరిష్కరం చేస్తారని తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలో అన్ని పాఠశాలలను సందర్శిం చాలని కమీషనర్‌ను అదేశించారు.పాఠశాలల్లో డబ్బులు మిగిలితే ఇతర పనులకు వినియోగించుకోవాలన్నారు. పాఠశాల పేరు స్టిల్‌తో చేసిన అక్షరాలను వినియో గించాలన్నారు. ఇప్పటి వరకు అయిన పనులు ఎప్టిఓ జనరేట్ చేయాలన్నారు.డిసెంబర్ చివరి కల్లా పనులు పూర్తి చేసి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించడానికి సిద్ధం చేయా లన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ 2022 పోస్టర్‌ను అవిష్కరించారు. డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, అర్‌అండ్‌బి ఈఈ సుదర్శన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివా స్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడే ఘనంగా మల్లన్న కల్యాణం

కొమురవెళ్ళి మల్లన్న ఆలయం ముస్తాబు

భక్తుల సౌకర్యార్థం భారీ ఏర్పాట్లు

పటిష్టమైన పోలీసు బందోబస్తు

కొమురవెళ్ళి, డిసెంబర్ 17, ప్రభాతవార్త: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ కొమురవెళ్ళి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18న అదివారం 10.45 నిమిషాలకు దేవాలయం ఆవణలో తోట బావి వద్ద స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. మల్లన్న కల్యాణం జరుగనుండడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కల్యాణాన్ని వీక్షించడానికి సుమారు మూడెకరాల స్థలంలో కల్యాణ వేదికతోపాటు భక్తుల సౌకర్యార్థం చలవ పందిళ్ళను ఏర్పాటు చేశారు. కల్యాణానికి రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. కల్యాణానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, హాజరు కానున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఆలయ నిర్వహకులు నిమగ్నమయ్యారు. గర్భాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను 30 కిలోలతో తయారు చేసిన వెండి సింహాసనంపై ఊరేగింపుగా కల్యాణ వేదిక అయిన తోట బావి వద్దకు తీసుకొస్తారు. కల్యాణంలో స్వామి వారి తరపున పడిగన్నగారి వంశస్తులు, అమ్మవార్ల తరపున మహాదేవుని వంశస్తులు పాల్గొంటారు. కార్యక్రమానికి ప్రభుత్వం తరపున మంత్రులు హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరన్‌రెడ్డిలు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించనున్నారు. భక్తుల కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. అలయ పాలక మండలి చైర్మన్ గీస బిక్షపతి, ధర మ్మకర్తలు, ఈవో బాలాజీతో పాటు ఏఈఓ వైరాగ్యం అంజయ్య, సూపరిటెండెంట్ నీల శేఖర్, అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ స్వామి వారి కళ్యాణోత్సవం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు.

విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న మల్లన్న సా్వమి ప్రధాన ద్వారం

పటిష్టమైన బందోబస్తు

మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణం ఈనెల 18న నిర్వహిస్తుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు. బందోబస్తును సెక్టార్లుగా విభజించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు రాకుండ ట్రాఫిక్ స్థలాలను ఏర్పాటు చేశారు. చీమ చిట్టుకుమన్న పట్టుకోవడానికి సీసీ కెమోరాలు ఏర్పాటు చేశారు. దేవాలయం ఆవరణలో సీసీ కెమోరాలతో పట్టిమైన నిఘా ఏర్పాటు చేశారు. 280 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో తగు ఏర్పాట్లు చేశారు.

పర్యవేక్షణకు భార్సీ పీఠాధిపతి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి కళ్యాణోత్సవ వేద పర్యవేక్షణకు శ్రీ రాష్ట్రీయ నిగమాగమ నీరజభాస్కర్ గురుసిద్ధ మణికంఠ శివాచార్య మహాస్వామి మహారాష్ట్ర షోలాపూర్ శ్రీమత్కాశీజ్ఞాన సింహాసన మహా పీఠశాఖ శ్రీ కమళసా్వమి బృహన్మఠాధీశులు మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. ఆదివారం వేకువజామున ఆలయవర్గాలు

ఏర్పాటు చేసిన స్వామి వారి కళ్యాణ వేదిక

నిర్వహించే దృష్టికుంభాల కార్యక్రమంలో స్వామిజీ పాల్గొనడంతో పాటు మల్లికార్జున స్వామి వారి తొలి దర్శనాన్ని చేసుకోనున్నారు. అనంతరం ఉదయం 10.45 గంటలకు ప్రారంభమయ్యే కల్యాణోత్సవాన్ని పర్యవేక్షిస్తారు.

వివాదంలో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి గాంధారి లతా నరేందర్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబర్17 ప్రభాతవార్త: జిల్లాలో పోడు భూములకు సంబంధించి సర్వేలు చాలా చోట్ల పెండింగ్‌లో ఉన్నాయని, రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదంలో ఉన్న భూములను పరిష్కరించాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆయా శాఖల అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశంలో వైద్య ఆరోగ్యం, మన ఊరు-మన బడి, ఆసరా పింఛన్లు, విద్యుత్, రహదారులు భవనాలు, మిషన్ భగీరథ శాఖల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60, 70 సంవత్సరాల నుండి కాస్తులో ఉన్నప్పటికీ అటవీ శాఖ వారు తాము ఏర్పాటు చేసిన ట్రెంచ్‌ను దాటి కాస్తులో ఉన్న భూములను అటవీ పరిధిలో కలుపుకుంటున్నారని, తద్వారా చాలా మంది రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. పోడు భూములకు సంబంధించి 62 గ్రామ పంచాయితీలే కాక, చాలా అభ్యంతరాలు వచ్చాయని, వాటిని పరిశీలించాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో పంచాయితీ రాజ్ రహదారుల బీటీ రెన్యూవల్, వరదలతో దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, బ్రిడ్జిల మరమ్మత్తులు, గిరిజన తండాల్లో రోడ్లకు, ఆర్ అండ్ బీ రోడ్లకు భారీగా నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలో దళితబంధు పథకం క్రింద రెండు కోళ్ల ఫారం యూనిట్లకు విద్యుత్ సౌకర్యానికి 1 లక్ష 93 వేల చొప్పున లబ్ధిదారులు డబ్బులు కట్టాల్సి ఉందని, కాగా ప్రత్యేక కేసుగా పరిగణించి యూనిట్లకు మినహాయింపుకు అవకాశాలు చూడాల్సిందిగా నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి విద్యుత్ ఎస్ఈని కోరారు. మన ఊరు-మన బడి క్రింద మొదటి దశలో 313 పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబంధించి ఎంబి రికార్డు అయిన వెంటనే డబ్బులు చెల్లిస్తున్నామని, నిధులకు కొరత లేదని స్పష్టం చేశారు. పాఠశాలల్లో శౌచాలయాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సమర్పిస్తే జిల్లా పరిషత్

సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్

నుండి నిధులు సమకూరుస్తామని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ డీఈవోకు సూచించారు. జిల్లాకు 57 పల్లె దవాఖానలు, ఒక బస్తీ దవాఖాన మంజూరయ్యాయని, త్వరలో 34 రెగ్యులర్ డాక్టర్లతో పాటు స్టాఫ్ నర్స్‌లు వస్తున్నారని అన్నారు. వచ్చే నెల 18వ తేదీ నుండి రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, ఇందుకోసం 40 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా కొన్ని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని సభ్యులు కోరగా వైద్య సిబ్బంది కొరతతో పాటు, నాల్గవ తరగతి సిబ్బంది కొరత ఉందని డాక్టర్ చందు నాయక్, డాక్టర్ చంద్రశేఖర్‌లు తెలుపగా, వైద్య సేవలు కొనసాగించండి, ఖాళీల భర్తీ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు చంద్రాగౌడ్, జిల్లా పరిషత్ సీఈవో వెంకట శైలేష్, ఆర్డీవో సాయిరాం, విద్యుత్ శాఖ ఎస్ఈ జానకిరామ్, డీఆర్‌డీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ అధికారి కమలాకర్, డీఈవో రమేష్ కుమార్ తదితర జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు చేయడం లేదు

తొగుట, డిసెంబర్ 17, ప్రభాతవార్త: ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన అధికారులు పనులు చేయించకపోవడంతో ఊపాటు ప్రజాప్రతినిధుకు సహకరించడం లేదని సభ్యులు అవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపిపి గాంధార లతానరేందర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కొమురయ్యను ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. అనంతరం చందాపూర్ సర్పంచ్ బొడ్డు నరసింహులు, కో-అప్షన్ సభ్యుడు ఎం.డి. కలిమొద్దీన్ మాట్లాడుతూ వాగు గడ్డ నుంచి నిత్యం గజ్వేల్‌కు విద్యార్థులతో పాటు అనేక మంది ప్రయాణీకులు వెళ్తారని రోడ్డు సరిగా లేక బస్సులు రావడం లేదని బస్సులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్‌తో పనులు ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అర్‌డబ్ల్యుఎస్ ఏఈ సమా శాలకు రావడం లేదని పనులు సరిగా చేయడం లేదని అయనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ శాఖ ప్రగతిని చదివి వినిపించారు. సకాలంలో విద్యుత్ బిల్లు చెల్లించి సహకరించాలన్నారు. ఎంపిటిసి వేల్పుల స్వామి తదితరులు మాట్లాడారు. ఎంపిపి గాంధారి లత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని ఇతరులకు అదర్శంగా నిలుపుదామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యవహించే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపిడిఓ శ్రీధర్, పిఎసిఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురయ్య, తహశీల్దార్ జహీర్ పాల్గొన్నారు.

మహాత్మా మన్నించూ..

- అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతినిత్యం తిరిగే చోటు

- నిన్ను మరవడం దురదృష్టకరం

- శిథిలావస్థలో మహాత్ముడి విగ్రహం

గజ్వేల్, డిసెంబర్ 17 (ప్రభాతవార్త): గజ్వేల్ నడిబొడ్డున గత 30 సంవత్సరాల క్రితం చౌరస్తాగా పేరొందిన హనుమాన్ అంగడిబజార్ సమీపంలో గల పాత మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా మహాత్మగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 30 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన మహాత్ముని విగ్రహానికి నాటి నుండి జయంతి, వర్ధంతిలను ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. అట్టి మహాత్ముని విగ్రహం నేడు శిథిలావస్థకు చేరుకుంది. స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మగాంధీ విగ్రహం శిథిలావస్థకు చేరుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చూసిచూడనట్లు ఎందుకు ఉంటున్నారో అర్థంకావడంలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గజ్వేల్ పట్టణంలో రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన ఉద్యమకారుల ఎన్నో విగ్రహాలు ఏర్పాటయ్యాయి. గత రెండు సంవత్సరాల క్రితం గజ్వేల్ పట్టణంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, వైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా మహాత్మగాంధీ విగ్రహాలను ప్రధాన కూడళ్ళ వద్ద ఏర్పాటు చేశారు. కానీ గజ్వేల్ పట్టణంలో హనుమాన్ అంగడి బజార్ వద్ద ఉన్న విగ్రహాన్ని మాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మగాంధీ విగ్రహం అవమానానికి గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్ముని విగ్రహం సిమెంట్ పెచ్చులు ఊడి, చేతిలో కట్టె విరిగిపోయి విగ్రహం మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. మహాత్ముని విగ్రహంపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మహాత్ముని విగ్రహం శిథిలావస్థకు చేరుకోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సీనియర్ సిటిజెన్లకు సన్మానం

మెదక్ రూరల్, డిసెంబర్17 ప్రభాతవార్త: తెలంగాణ ఆల్ సీనియర్స్ సిటిజెన్ ఆరవ వార్షికోత్సవం పురస్కరించుకొని సేవలందిస్తున్న సీనియర్ సిటిజెన్లను, తల్లిదండ్రులను బాగా చూసుకుంటున్న పలువురిని శనివారం సన్మానించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్, విశ్రాంత ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు మంగ శంకర్‌గౌడ్, విశ్రాత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జగదీష్ చంద్ర, విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణమూర్తిలను ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర సంఘం అధ్యక్షులు నర్సింహరావు సన్మానించారు. వీరితో పాటు తల్లిదండ్రులను బాగా చూసుకుంటున్న మెదక్‌కు చెందిన సూరజ్ దీయాల్, గంట సంపత్, నిరుడి జోసఫ్‌లను సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షులు అరుణ్, దయరాజ్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్లను సన్మానిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

శివ్వంపేట, డిసెంబర్17 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదానికి గురై ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శివ్వంపేట మండల పరిధిలోని పెద్దగొట్టిముక్కుల గ్రామ శివారులో శనివారం జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. మండల పరిధలోని గోమారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న బసవేశ్వర్ స్వామి ప్రతి రోజు విధంగానే ఈ రోజు ఉదయం పాఠశాలకు వెళ్తున్న సమయంలో పెద్దగొట్టిముక్కుల గ్రామ శివారులో కుక్క అడ్డు రావడంతో జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మరణించాడు. టీఆర్‌టీ 2017లో నియామకం పొంది 317 జీవోలో జెడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయ్యి వచ్చిన బసవేశ్వర్ స్వామి స్వస్థలం జిల్లా కేంద్రమైన మెదక్ సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నివాసి. మృతుడు బసవేశ్వర్ స్వామి భార్య కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలే. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో ప్రభుత్య ఉపాధ్యాయుడు మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక మండలంలోని ఉపాధ్యాయులందరూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తెలియగానే మండల విద్యాధికారి బుచ్చా నాయక్‌తో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య భాగ్యవతి ఫిర్యాదు మేరకు శివ్వంపేట ఎస్ఐ రవికాంత్‌రావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన గుండం బాలాజీ బ్రహ్మోత్సవాలు

స్వామి వారి చక్ర స్నానం

అల్వాల్, డిసెంబరు 17 ప్రభాతవార్త: గుండం బాలాజీ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిసాయి. ఆఖరి రోజు స్వామి వారికి చక్ర స్నానంతో పాటుగా హోమం నిర్వహించడం జరిగింది. ఈ నెల 14న ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజులు పాటు సాగాయి. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు పరాంకుశం మాధ వాచార్యులు కృష్ణమా చార్యులు పర్యవేక్షణలో ఉత్సవాలు జరిగాయి.

ముఖ్యమంత్రి కేసిఆర్ అన్ని మతాలను గౌరవిస్తున్నారు : ఆకులరూప

సాంబమూర్తి నగర్‌లో క్రిస్మస్ కానుకలను అందజేస్తున్న మాజీ కార్పోరేటర్ ఆకులరూప తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త: తెలంగాణలో ముఖ్య మంత్రి కేసిఆర్ అన్ని మతాల వారికి సమాన గుర్తింపు ఇస్తున్నారని మోండా డివిజన్ మాజీ కార్పోరేటర్ ఆకులరూప తెలిపారు. శనివారం సాంబమూర్తి నగర్‌లోని క్రిస్టియన్లకు ఆకులరూప చేతుల మీదుగా గిఫ్ట్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరిక్రిష్ణ, బిఆర్ఎస్ నేత స్కైలాబ్, చర్చి ఫాదర్లు మోతీ మార్క్, ప్రభుదాస్, జయరాజ్, రాజమణి, రాములు, నందు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్లార్ ఐటిఎంలో ఘనంగా స్నాతకోత్సవం

పట్టాలను ప్రధానం చేస్తున్న ప్రేమబసెట్టి, భాస్కర్ తదితరులు

దుండిగల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త: నగరశివారు దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఎమ్మెల్లార్ఐటిఎం), ఫార్మాసీ కళాశాలలు సంయుక్తంగా స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి శ్రీమతిశ్రీ ప్రేమబసెట్టి, జి.భాస్కర్, రాకేష్‌కమపూర్‌లు అతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేశారు. ఈసందర్భంగా కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి తమ అధ్యాపక బృందం విశేష కృషి చేస్తోందన్నారు. ఈరోజు పట్టాలను అందుకున్న విద్యార్థులు అంకుర సంస్థలు నెలకొల్పే దిశగా పయనించి మంచి భవిష్యత్తును సొంతం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డా.కెవి.రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఇంజినీరింగ్ విద్య దేశానికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు నూతన సాంకేతికను అందిపుచ్చుకొని సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. పట్టాలను అందుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్లార్ గ్రూప్స్ అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ డా.జ్యోతి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.అరుణమాలిక్, నిర్వాహకులు డా.వినోద్, డా.అమర్‌నాథ్, డా.శ్రీనివాస్, డా.బాసిత్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టాలు దాటుతూ రైలు ఢీకొని వృద్ధుడు మృతి

నాంపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త : నాంపల్లి (హైదరాబాద్) జీఆర్‌పి పరిధిలో హైటెక్‌సిటీ బోరబండ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. హైదరాబాద్ జీఆర్‌పి హెడ్‌కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాసులు తెలిపిన వివరాల్లోకి ప్రకారం ... బోరబండ హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ల మధ్య కిలోమీటర్లు నంబరు 170/15-17 వద్ద అప్‌లైన్‌లో సోమవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో వేగంగా వస్తున్న రైలును గమనించక పట్టాలు దాటుతున్న వృద్ధుడిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనగా చెట్ల పొదల్లోపడి తీవ్రగాయాలు రక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెంది, కుళ్లిపోయిన స్థితిలో శవం లభ్యమైంది. మృతుడి వయస్సు 50-55 సంవత్సరాలు. ఎత్తు 5.3 అడుగులు, గుండ్రనిముఖం, నలుపురంగు, నలుపుతెలుపు జుట్టు, ఛాతి ఎడమవైపు పుట్టుమచ్చ ఉంది. మృతుడు బూడిదరంగు టీషర్టు, నీలంరంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహానికి పంచనామా చేసి, కేసు నమోదుచేసి ప్రభుత్వ ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మార్చురీలో భద్రపరిచారు. మృతుల సంబంధీకులు ఎవరైనా ఉంటే పూర్తి వివరాల కోసం జీఆర్‌పి నాంపల్లి రైల్వే పోలీసుస్టేషన్ నంబరు 040-23202238లో లేదా హెడ్‌కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాసులు మొబైల్ నంబరు 9848343544లో సంప్రదించవచ్చునని తెలిపారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 17,ప్రభాతవార్త : స్థానిక మధురానగర్‌కాలనీలోని బచ్‌పన్ ప్లేస్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా చిన్నారులు క్రిస్మస్ వేడుకల దృశ్యాలు, పర్యావరణ పరిరక్షణ, గణితంలోని మెళకువలు, మతసామరస్యాన్ని తెలియజేసే దేవాలయం, చర్చి, మసీదు, మానవ శరీర నిర్మాణం, చెట్టులోని విభాగాలు, పగలు,రాత్రి తేడాలు, అడవులు వాటి ప్రాముఖ్యత,మానవ జీవన విధానం, ట్రాఫిక్ రూల్స్ తదితర నమూనాలు తయారు చేసి వాటిని చిన్నారుల తల్లిదండ్రులు, విజిటర్స్, కాలనీవాసులకు వివరించారు. తొలుత స్కూల్ డైరెక్టర్లు మృదుల శర్మ, మురళీధర్‌రెడ్డిలు ఈ వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చైతన్యరెడ్డి,టీచర్లు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంపై సవతి ప్రేమ చూపుతున్న సిఎం

కేసిఆర్ వైఖరికి నిరసనగా ఆందోళనలు చేపడుతాం : రామక్రిష్ణ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామక్రిష్ణ తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంపై ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రదర్శిస్తున్న వైఖరికి నిరసనగా ప్రజా ఆందోళనలు చేపడుతామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్‌మెంబర్ జె.రామక్రిష్ణ హెచ్చరించారు. శనివారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రామక్రిష్ణ మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు ప్రాంత వాసులకు ఉచిత మంచినీరు అందిస్తున్నామని ప్రకటనలు చేయడం తప్పా వాటిని అమలు చేయకుండా నీటి బకాయిలు చెల్లించాలని కంటోన్మెంట్ బోర్డుకు జలమండలి ఉత్తర్వులు జారీ చేయడం సరైంది కాదన్నారు. కంటోన్మెంట్ బోర్డుకు నీటి బకాయిలు రూ.52 కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని జల మండలి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కంటోన్మెంట్‌లో మంచినీటి సమస్య తీర్చకపోతే వారం రోజుల్లో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని,ప్రజా ఆందోళనలు చేపడుతామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సవతి ప్రేమ చూపుతుందన్నారు. మంచినీటి సరఫరాపై నెలకు రూ. 2 కోట్లు చెల్లించాలని బోర్డుపై ఒత్తిడి తెస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విజయానంద్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో ఏర్పాట్లు పరిశీలన

మణికొండలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బస్తీ దవాఖానాలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి

నార్సింగి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : మణికొండలో ఈ నెల 19.వ,తేదీన ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావ్ చేతుల మీదుగా ప్రారంభమయ్యే నూతన బస్తీ దవాఖానాలో ఏర్పాట్లను ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. అధునాతనమైన స్కానింగ్ మిషన్లు, బెడ్లు, రక్త పరీక్షల ల్యాబ్, మందుల పంపిణీ కేంద్రం ఇలా అన్నింటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. విద్య, వైద్యం రెండింటిని ఆధునీకరించి కార్పోరేటర్ సంస్థలకు ధీటుగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా హరీష్‌రావ్ ఆరోగ్యశాఖ మంత్రిగా వచ్చాకా వైద్య విభాగంలో సమూల మార్పులు వచ్చాయన్నారు. బస్తీ దవాఖానాల ఏర్పాటుతో చాలా మంది నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. మణికొండ వంటి ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కూలీలుగా పని చేస్తున్న నిరుపేదలకు ఈ బస్తీ దవాఖానాలు చాలా ఉపయుక్తంగా మారుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ టిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, కౌన్సిలర్ వసంత్ చౌహాన్, నాయకులు ఏరుపుల కుమార్, శ్రీకాంత్, గంగాధర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాదయాత్రకు బ్రహ్మరథం

డివిజన్‌లో పాదయాత్రలో చేసిన అభివృద్ధిపనుల వివరిస్తున్న కార్పొరేటర్ డాక్టర్‌సురేఖ ఓంప్రకాష్‌బిస్వా

గన్‌ఫౌండ్రి, డిసెంబర్ 17ప్రభాతవార్త: గన్‌ఫౌండ్రి డివిజన్‌లో కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ బిస్వా చేపట్టిన రెండవ రోజు ప్రజా పాదయాత్ర సుల్తాన్‌బజార్‌లోని దుర్గాబైరీ నుండి డప్పుచప్పులతో హుషార్‌గా ప్రారంభమైయింది. పాదయాత్రను గోషామహల్ నియోజకవర్గం బిజెపి పార్టీ కన్వీనర్ కృష్ణ జెండాను ఊపి పాదయాత్రను ప్రారంభించారు. కార్పొరేటర్ డాక్టర్ సురేఖ,బిజెపిదళితమోర్చ ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వాలు బిజెపినాయకులు,కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ డివిజన్‌లో తాము చేసిన అభివృద్ధి పనులపై పుస్తకరూపంలో ప్రజలకు అందచేశారు.రామకొటిబస్తీలో ప్రజలు డ్రైనేజీ సమస్యలను వివరించారు.డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.18ప్రాంతాలల్లో గుండా పాదయాత్ర చేస్తూ బొగ్గులకుంటలోని మనోరంజిత స్కూల్‌లో ముగిసింది.రాత్రినిద్రకూడా ఇదే ప్రాంతంలో జరుగుతుందన్నారు. రాత్రినిద్ర ఇక్కడే కొనసాగుతుందన్నారు.ఈ పాదయాత్రలో డివిజన్ ఇన్‌చార్జ్ జ్ఞానేశ్వర్, పాదయాత్ర ఇన్‌చార్జ్ రాకేష్,ఎస్సీ మోర్చకార్యదర్శి నిర్మల్,రాణి,వివేక్,సాయిగౌడ్, సుధర్శన్,శ్యామ్ ,అరవింద్,దీపక్,పప్పి,రాకేష్,శివ,నాగేశ్వర్ తదితరులుపాల్గొన్నారు.

అన్ని వార్డులలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలి : కమిషనర్

నార్సింగి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని అన్ని వార్డులలో శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టాలని కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో ఈనెల 19.వ,తేదీ నఉంచి 22.రోజుల పాటు ప్రతీ వార్డులో రోడ్లు శుభ్రంగా ఊడ్చాలని, రెడ్ల పక్కల ఉన్న గడ్డి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించాలని, చెత్త లేకుండా ఎప్పటికప్పుడు ఎత్తి వేయాలని శానిటేషన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మా కార్పోరేషన్ తరపున ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రజలందరూ తమ ఇళ్లల్లో వెలువడే చెత్తను రోడ్లపై కాకుండా ఇళ్ల ముందుకు వచ్చే ఆటోలలోనే వేయాలని సూచించారు. తడి,పొడి చెత్తను వేరు చేసి వేయడంను అలవాటు చేసుకోవాలని కమీషనర్ సూచించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక కార్పోరేటర్లు, సంబంధిత శాఖల అధికారులు కూడా భాగస్వాములయ్యి ప్రజలను చైతన్యవంతులను చేయాలని అవసరం ఉందని వేణుగోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

వీరశైవ లింగాయత్, లింగ బలిజలను ఎంబిసీ జాబితాలో చేర్చాలి

ప్రసంగిస్తున్న తెలంగాణ వీరశైవ లింగాయత్ లింగ, బలిజ సంఘం అధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్ప

చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త: వీరశైవ లింగాయత్, లింగ బలిజలను వెంటనే ఎంబీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వీరశైవ లింగాయత్ లింగ, బలిజ సంఘం అధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్ప కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంబిసిలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 28,29 తేదీల్లో ఢిలో ఢిల్లీలో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. సంఘం రాష్ట్ర కార్యవర్గసమావేశం శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉన్నామని, ఈ పార్లమెంట్‌లోనే తమను ఎంబీసీ జాబితాలో చేర్చే విధంగా తీసుకోవాలన్నారు. బోదన్‌లో శ్రీకాంత్ పాటిల్ అనే యువకుడిని హత్య చేశారని, ఈ హత్యకు కారకులైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘాన్ని మరింత బలోపేతం దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి తెలిసే విధంగా పెద్దసంఖ్యలో ఢిలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. గౌరవ అధ్యక్షుడు పట్న సంఘమేశ్వర్, ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, కోశాధికారి జి.దినేష్ పాటిల్, పి.శివశరణ్, భరత్, సంఘం మహిళా గౌరవ అధ్యక్షురాలు లక్ష్మీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు

మేడ్చల్, డిసెంబర్ 17. ప్రభాతవార్త : మేడ్చల్‌లో బొడ్డురాయి పున:ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడు రోజు శనివారం ఉదయం పుష్పాదివాసం, శయ్యాదివాసం, ఫలాదివాసం, తదితర పూజా కార్యక్రమాలు, హోమం కొనసాగాయి, వేద పండితులు చేపట్టిన పూజలతో నగరమంతా వేదమంత్రాలతో మారు మ్రోగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహరెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తాండాల అభివృద్ధికి కృషి

కౌన్సిలర్ శంకర్‌చౌహాన్

సిసిరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శంకర్‌చౌహాన్

దుండిగల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 27వ వార్డులోని తాండా-2లో నూతనంగా నిర్మిస్తున్న సిసిరోడ్డు పనులను కౌన్సిలర్ శంకర్‌చౌహాన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే,మున్సిపల్ చైర్‌పర్సన్ సహకారంతో వార్డు పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను తీసుకవచ్చి తాండాలను అభివృద్ధి చేయడంతో పాటు ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సినియర్ నాయకులు రవీందర్‌నాయక్, వార్డు అధ్యక్షులు అమర్ సింగ్‌నాయక్, టిఆర్ఎస్‌వి నాయకులు ప్రవీణ్‌నాయక్, రెడ్యానాయక్, నెహ్రు, శ్రీనివాస్‌నాయక్, దేవానాయక్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం కెసిఆర్‌ను కలిసిన ముచ్చకుర్తి ప్రభాకర్

చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త: దేశ రాజకీయాల్లో ప్రబలమైన శక్తిగా బిఆర్ఎస్ అవతరిస్తుందని ఆర్టీసిక్రాస్ రోడ్స్ లక్ష్మీగణపతిదేవాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్ అన్నారు. ఢిల్లీలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా సిఎం కెసిఆర్‌తో పాటు పలువురు నేతలను కలిశారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న కెసిఆర్ గుణాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టడం కోసం బిఆర్ఎస్‌గా ఆవిర్భవించిందని అన్నారు.

'సెక్యులర్-పొలిటికల్-మీడియా క్రిస్మస్' ఉత్సవాలు

చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త: క్రైస్తవ ధర్మప్రచార పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'సెక్యులర్-పొలిటికల్-మీడియా క్రిస్మస్' ఉత్సవాలను 22న నిర్వహించబోతున్నట్లు సమితి అధినేత జెరుషలేము మత్తయ్య వివరించారు. హిందూ, ముస్లీం, క్రిస్టియన్, బౌద్ధ, జైన్, పార్సీ, నాస్తీక్ సర్వమత గురువులతోపాటు, క్రైస్తవ ఉద్యోగులు, పాత్రికేయులతో కలిసి ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సనత్ నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతాం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి అభివృద్ధి పనులపై పర్యటిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 17,ప్రభాతవార్త : సనత్ నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి తలసాని అన్నారు. సనత్ నగర్ ప్రాంతంలో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఆప్రాంతంలో అపార్టుమెంట్ల ముందు పుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని మంత్రి ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి వెంటనే అక్రమణలను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటుచేసి గ్రీనరీ పనులను చేపట్టాలని హార్టీ కల్చరర్ అధికారులు ఆదేశించారు. అదేవిధంగా సత్యనగర్ ఫ్లైయవర్ కింద రోడ్డు నిర్మాణాలు చేట్టాలని కోరారు. ఇండస్ట్రియల్ ప్రాంతంలో అండర్ పాత్‌నిర్మాణం కోసం నిదులు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. తాను ఎల్లప్పుడు ప్రజలకు అందూటులో ఉంటానని ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి తగిన విధంగా కృషిచేస్తానాన్నారు. ఈకార్యక్రమంలో కార్పోరేటర్ కొలన్ లక్ష్మీ బాల్‌రెడ్డి, జోనల్ కమీషనర్ రవికిరణ్, బిసి మోహన్ రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసిపి రమేష్, లోదా ఆపార్టుమెంట్ అసోసియేషణ్ అధ్యక్షులు సుబ్బారావు, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, ప్రధానకార్యదర్శి రాజశేఖర్, వేణు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పరివర్తన యొక్క బీజాలు చిన్న వయస్సు నుంచి అలవర్చుకోవాలి

రామంతాపూర్‌లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి అరవింద్‌కుమార్, ఎమ్మెల్యే బేతి, ప్రిన్సిపల్ డా.ఎస్.నరసింహారెడ్డి తదితరులు

ఉప్పల్, డిసెంబరు 17 ప్రభాతవార్త : రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ ముగింపు వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపల్ డా.సల్లారం నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, నటుడు, దర్శకుడు అడివి శేషు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏడాది పొడవునా నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సంగీత విభావరి ది హ్యూమనాయిడ్ పేరుతో విద్యార్థుల కాల ప్రయాణానికి సంబంధించిన అద్భుత కథను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ డా.సల్లారం నరసింహారెడ్డి మాట్లాడుతూ వినోదాత్మక ప్రదర్శన, విద్యావేత్తలు, సహ పాఠ్యాంశాలు, పాఠ్యేతర విషయాల సమతుల్యతను చూపుతుందన్నారు. తద్వారా విద్య సంపూర్ణంగా మారుతుందన్నారు. పరివర్తన యొక్క బీజాలు చిన్న వయస్సు నుంచి అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలో ఈ రోజు మన పిల్లలకు అందించే విలువ భవిష్యత్‌లో మనం ఆశించే పరివర్తన తీసుకుని వస్తుందన్నారు. సంగీత మహోత్సవం, నాటక రంగం, చరిత్ర, సంగీతం, నృత్యం తదితర అంశాలతో కూడిన ప్రదర్శలను సుమారు 700లకు పైగా విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు నిర్వహించారు. స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. నవరస నృత్యోత్సవ్, జాతీయ ఇంటర్ స్కూల్ డాన్స్ పోటీలు, అఖిల భారత ఐపిఎస్‌సి అండర్ 17 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విద్యార్థులను నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. 1972లో స్థాపించిన హెచ్‌పిఎస్ నగరంలో ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తుందని ప్రిన్సిపల్ డా.సల్లారం నరసింహారెడ్డి సూచించారు. రామంతాపూర్‌లో 37.5 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న క్యాంపస్‌లో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, హెచ్‌పిఎస్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.65లక్షలతో అడిక్‌మెట్ డివిజన్‌లో రోడ్డు అభివృద్ధి పనులు

పనులను ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త: అడిక్‌మెట్ డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం డివిజన్‌లోని రూ.50లక్షలతో అచ్యుతరెడ్డి మార్క్ ప్రాంతంలో రూ.15లక్షలతో స్టీల్ ఫ్యాక్టరీలో రోడ్డు పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, జిహెచ్ఎంసి డీఈఈ సన్నీ, ఏఈ విశ్వేస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేతలు కొండపల్లి మాధవ్, మనోహర్‌సింగ్, ఖదీర్, గురుదీప్, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం జరుగుతుందని వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

'బాలు-వంశీ-శుభోదయం' పురస్కారాలు-2022'

చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త: వంశీ ఇంటర్నేషనల్(ఇండియా), లిటిల్‌మ్యూజిషియన్స్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో 'బాలు-వంశీ-శుభోదయం' పురస్కారాలు-2022' ప్రదానోత్సవ కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో వంశీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవవి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ, కన్వీనర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. నిర్వాహక సంస్థ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సురభివాణిదేవి హాజరై సినీ సంగీత దర్శకులు ఆర్‌పి.పట్నాయక్, గాయకులు కె.రామాచారి, కళాసామ్రాట్ పొత్తూరి రంగారావుకు పురస్కారాలు అందించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పద్మ భూషణ్ పురస్కారగ్రహీత డాక్టర్ ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం తొలి పాటకు 56 వసంతాలు' సందర్భంగా 'బాలు పాటకు పట్టాభిషేకం-ప్రారంభం రామాచారి శిష్యబృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి అద్భుతంగా సాగింది. ఈ సందర్భంగా సురభీవాణిదేవి మాట్లాడుతూ మంచి సంగీతం మానసిక ప్రశాంతతను అందిస్తుందన్నారు. సినీ సంగీత దర్శకులు ఆర్‌పి.పట్నాయక్ మాట్లాడుతూ తాను సన్మానాలకు దూరంగా ఉంటాను, ఎస్‌పి.బాలుతనకు తండ్రి సమానులు అని అన్నారు. అవార్డులు తీసుకోవడం వల్ల బాధ్యతలు పెరుగుతాయని అన్

మత్తునికి కుంటుబానికి సర్పంచ్ ఆర్థిక సాయం

టేక్మాల్,డిసెంబరు 17, ప్రభాతవార్త: టేక్మాల్ గ్రామానికి చెందిన బిపాసా మృతిచెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సుప్రజ భాస్కర్ మత్తునికి కుంటుబానికి 5 వేల రూపాయలను ఆర్థిక సాయంగా వారి కుమార్తెకు అందజేశారు. గత ఏడాది నుండి నుంచి అనారోగ్యంతో బాదపడుతున్నారని ఎంతవైద్యం చేసిన ప్రయోజనం లేక పోయిందన్నారు. ఈమె గతంలో గ్రామ పంచాయితీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసిందన్నారు. ఆమె కుటుంబికులు ఆ ధైర్యపడవద్దన్నారు. సర్పంచ్ వెంట పట్నం రాములు, సలీం, సలోద్దిన్, ఆమీర్ వసీం, బాలకిష్ణ, సత్యనారాయణ, పెంటయ్యలున్నారు.

పుస్తె మెట్టెల పంపిణీ

పుస్తే మెట్టెలు అందజేస్తున్న దృశ్యం

కౌడిపల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త: ఆశిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రాయిలాపూర్‌కు చెందిన రాయెల్లి దేవయ్య గంగమ్మ దంపతుల కూతురు లతపెండ్లికి ఆశిరెడ్డి మెమోరి యల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చిలువు లు వెంకటేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా పుస్తె మెట్టెల కోసం రూ.10,000ల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమలో కౌడిపల్లి వార్డు మెంబరులు తిరుమలేష్, బిఆర్ఎస్ నాయకులు మురళీదర్‌రెడ్డి, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామ్‌రెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, నాగభూషణం, పోచయ్య, నర్సింలు, కుమింటి శంకర్‌గౌడ్, కుర్మ పోచయ్య, సంతోష్‌కుమార్, వెంకటేశం, పోతరాజు చందర్ యూత్ నాయకులు మన్నే నర్సింలు ఉన్నారు.

పేదింటి ఆడబిడ్డకు పుస్తె మెట్టెల పంపిణీ

పుస్తెమెట్టెలను అందజేస్తున్న కనకయ్యముదిరాజ్

మర్కుక్, డిసెంబర్ 17 (ప్రభాతవార్త): నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడంలో ఎంతగానో తృప్తి ఉంటుందని బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్యముదిరాజ్ అన్నారు. మర్కుక్ గ్రామానికి చెందిన గౌరిగారి స్వామి, నర్సమ్మ దంపతుల కూతురు సోని వివాహానికి శనివారం మేకల కనకయ్యముదిరాజ్ స్థానిక సర్పంచ్ భాస్కర్‌తో కలిసి పుస్తెమెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ముదిరాజ్ కుటుంబాలకు చెందిన ఎవరికైనా తనవంతు సహాయ సహకారాలు చేస్తానని తెలిపారు. సమాజ సేవలో నావంతు సహాయంగా ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ డైరెక్టర్ మాధవరెడ్డి, నాయకులు పాపోళ్ళ రాజు, యూత్ నాయకులు కర్ణాకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

వరకట్న వేధింపులు-అత్తింటివారిపై కేసు నమోదు

మనూర్, డిసెంబరు 17, ప్రభాతవార్త: అధనపు కట్నం కోసం అత్తింటి వేదింపులు అధికం కావడంతో అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం... మండలంలోని బెల్లాపూర్ గ్రామానికి చెందిన మమతను న్యాల్‌కల్ మండలంలోని గుంజోటి గ్రామానికి చెందిన రవితో 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. రెండు మూడు సంవత్సరాల పాటు వీరి సంసారం సజావుగా సాగినా తర్వాత అదనపు కట్నం కోసం వేదిం పులు అధికమయ్యాయన్నారు. మమత భర్త రవి సక్కుబాయిని రెం డో పెళ్లి చేసుకున్నాడన్నారు. అధనపు కట్నం కోసం వేదిస్తున్న భర్త రవి, అత్త కమలమ్మ, రవి రెండో భార్య సక్కుబాయిలపై మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

నెలరోజులో అందుబాటులోకి నూతన మండల పరిషత్ కార్యాలయం

-జెడ్పీటీసీ ముత్యంగారి మేఘమాల సంతోష్ కుమార్

నూతన మండల పరిషత్ కార్యాలయం

కొల్చారం, డిసెంబర్17 ప్రభాతవార్త: మరో నెల రోజుల వ్యవధిలో నూతన మండల పరిషత్ కార్యాలయం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని కొల్చారం మండల జెడ్పీటీసీ సభ్యులు ముత్యంగారి మేఘమాల సంతోషికుమార్ అన్నారు. శనివారం వారు ప్రత్యేకంగా ప్రభాతవార్తతో మాట్లాడుతూ నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డిల సహకారంతో దాదాపు కోటి రూపాయల వ్యయంతో మండల పరిషత్ కార్యాలయం పూర్తి దశకు చేరుకుందని, నెల రోజుల వ్యవధిలో మండల ప్రజలకు అందుబాటులోకి రాబోతుందన్నారు. నూతన సంవ్సర కానుకగా మండల ప్రజలకు నూతన కార్యాలయం అందుబాటులోకి రావడం సంతోషకరమని, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డిలు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని, వారికి మండల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు భూమిపూజ

కొల్చారం, డిసెంబర్17 ప్రభాతవార్త: మండల పరిధిలోని నాయిని జలాల్‌పూర్ గ్రామంలో శనివారం మిషన్ భగీరథ 20 వేల కేఎల్ సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు స్థానిక సర్పంచి కర్రె లచ్చయ్య, ఎంపీటీసీ ఉదయ వేమారెడ్డిల చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఉదయ వేమారెడ్డి, ఉప సర్పంచి వనజ పాండరి, మాజీ సొసైటీ చైర్మన్ నాయిని లక్ష్మయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పెద్ద సంజీవులు, సెక్రటరీ రాజేందర్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ నాయిని సత్యనారాయణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ నాయిని రాయన్న, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచి లచ్చయ్య

విలేకరులతో మాట్లాడుతున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు

బిఆర్ఎస్ ముస్లిం మైనార్టీలకు ఒరగబెట్టిందేమి లేదు

పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు

సిద్దిపేట రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త : బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు ముస్లిం మైనార్టీలకు ఒరగబెట్టిందేమి లేదని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం అయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పిన సిఎం కెసిఆర్ పట్టించుకున్న పాపానపోవడం లేదన్నారు. మైనార్టీలకు రుణాల పేరుతో ప్రభుత్వం మరో మోసానికి తెరలేపిందన్నారు. డిసెంబర్ 16 ను ంచి రుణాల కోసం దరఖాస్తు చేసుకుందామంటే సంబంధిత వెబ్ సైట్ తెచుకోకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిద్దిపేటకు చెందిన మైనార్టీ నాయకులు గొప్పలు చెప్పడమే తప్ప చేసింది శూన్యమన్నారు. గతంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇప్పటీ వరకు ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు అన్యాయమే జరుగుతుంది తప్ప ఒరిగిందేమిలేదన్నారు. దేశ ప్రజలు బిఆర్ఎస్ పార్టీని సిఎం కెసిఆర్‌ను నమ్మె పరిస్థితుల్లో లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ముస్లిం మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావడానికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలువాలన్నారు. సమావేశంలో ఫయాజ్, గయాసుద్దీన్, హసుద్దీన్, నదీమ, అప్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణోత్సవానికి పటిష్టమైన బందోబస్తు : సిపి

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్వేత

కొమురవెల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త : కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ ఎన్.శ్వేత అన్నారు. శనివారం మల్లన్న కళ్యాణం జరిగే తోట బావి,పరిసరా ప్రాంతాలు, వీఐపి పార్కింగ్, జనరల్ పార్కింగ్, దర్శన ప్రదేశాలను అమె పరిశీలించి అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ కళ్యాణోత్సవం సందర్భంగా పటిష్ట బందోబస్తును 4 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వామి వారి అవరణలో 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 280 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. అమె వెంట పోలీసు అధికారులు సందెపోగు మహేందర్, శ్రీనివాస్, చంద్రమోహన్, బాలాజీ, అలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల విషయంలో రాజకీయం తగదు

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మిరుదొడ్డి, డిసెంబర్ 17, ప్రభాతవార్త : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో రాజకీయం తగదని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించతలపెట్టిన ప్రాథమిక వైద్య ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేశారు. అలాగే వంటగది, టాయిలెట్స్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే స్వంత నిధులతో ఏర్పాటు చేసిన హై మాస్క్ లైట్లను సర్ప ంచ్ మల్లన్నగారి శాంతమ్మతో కలిసి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తుందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో అరోగ్య ఉప కేంద్ర భవనాల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి హరీష్‌రావు వివక్ష చూపుతున్నారని తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అడ్డుతగలకుండా సహకరించాలన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న మురికి కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.అంతకు ముందు లింగుపల్లిలోని ఎల్లమ్మ దేవాలయంలో అయన ప్రత్యేక పూజలు చేసి సొంత డబ్బులతో అలయ అవరణలో చేపడుతున్న వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. అయా కార్యక్రమాల్లో బిజెపి నాయకులు దేవరాజు, మల్లన్నగారి బిక్షపతి, పరుశరాములు, రమేష్‌గౌడ్, నవీన్‌రావు, కడారి యాదగిరి, చింత సంతోష్ తదితరులు ఉన్నారు.

మందులు పంపిణీ

మిరుదొడ్డి, డిసెంబర్ 17, ప్రభాతవార్త: భూంపల్లి గ్రామంలో శనివారం రాష్ట్ర

మందులను పంపిణీ చేస్తున్న డిసిసిబి డైరెక్టర్ వెంకటయ్య

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మధుమేహం, బీపీ ఎన్‌సిడి కిట్‌ను డిసిసిబి డైరెక్టర్ బక్కి వెంకటయ్య అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉన్నతమైన జీవనానికి అరోగ్యకరమైన అలవాట్లను అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఉమారాణి బాల్‌గౌడ్, ఎఎన్ఎం మంజుల, అశ కార్యకర్తలు లక్ష్మీ, రమణ, కల్పన, మంజులతో పాటు గ్రామ యువకులు అతికం లింగం, కుర్మా లోకేష్, దోమకొండ నరేష్, ఉడిది సన్నిత్ తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం మెదక్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

మెదక్ అర్బన్, డిసెంబర్17 ప్రభాతవార్త: తెలంగాణ మున్నూరు కాపు సర్నలిస్టుల ఫోరం మెదక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని టీఎంకేజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. టీఎంకేజేఎఫ్ జిల్లా కన్వీనర్‌గా తిమ్మన్నగారి శ్రీధర్, పి. ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు సీహెచ్. రాహుల్, గడ్డం ప్రశాంత్, కోశాధికారిగా ఎస్. నవీన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ. సుధాకర్, వి. శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్. నాగభూషణం, వి. రాజు, ప్రచార కార్యదర్శిగా ఎస్. శేఖర్, కార్యవర్గ సభ్యులుగా ఎ. భాస్కర్, ఎ. సత్యనారాయణ, ఈ మల్లేష్, గౌరవ సలహాదారులుగా ఎ. వెంకన్నబాబు, కామాటి కృష్ణ, సుందం రాజశేఖర్, మెదక్ అసెంబ్లీ కన్వీనర్‌గా ఎ. శేఖర్, నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్‌గా జి. మహేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్త లక్ష్మణ్ మాట్లడుతూ మున్నూరు కాపు జర్నలిస్టుల ఐక్యత లక్ష్యంగా తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్, కో కన్వీనర్లు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొత్త దేవయ్య పటేల్, ఉపాధ్యక్షులు బట్ట జగపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేమె యాదగిరి, హన్మంతరావు లక్ష్మణ్‌లు అభినందించారు.

రక్తదానం చేస్తున్న విగ్రం శ్రీనివాస్‌గౌడ్

రక్తదానం ప్రాణాలను కాపాడుతుంది : ఎఫ్‌సీఐ డైరెక్టర్

పెద్దశంకరంపేట, డిసెంబర్17 ప్రభాతవార్త: రక్తదానం మహా దానమని కేంద్ర ఫుడ్ కార్పోరేషన్ డైరెక్టర్ విగ్రం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు కార్యకర్తలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించి స్వయంగా ఆయన రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విగ్రం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఒక వ్యక్తి పది మంది ప్రాణాలను కాపాడే అద్భుత అవకాశం రక్తదానం వల్ల లభిస్తుందన్నారు. అనంతరం అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు లక్ష్మీ రమేష్, కృష్ణమూర్తి, సర్వేశ్వర్, గంగాధర్‌గౌడ్, సతీష్‌గౌడ్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

జిల్లా ఖజానాధికారికి వినతి పత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్17 ప్రభాతవార్త: ఆగస్టు నుండి పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లా ఖజానాధికారికి వినతి పత్రం సమర్పించారు. ఎస్‌టీవో పరిధిలో ఏ బిల్లులు పెండింగ్‌లో లేవని జిల్లా ఖజానాధికారి తెలిపారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు కూడా విడతల వారిగా ఇస్తూ, అవి కూడా 5-6 నెలలుగా చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేసి పెండింగ్ డీఏ, పీఆర్సీ బకాయిలను చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల వివాహాలకు అండగా సంతోష గంగాధర్



పుస్తె మెట్టెలను అందజేస్తున్న బండారి సంతోష గంగాధర్

శివ్వంపేట, డిసెంబర్17 ప్రభాతవార్త: నిరుపేల ఆడపిల్లల వివాహాలకు ఆసరా నిలుస్తుండటమే కాకుండా తనవంతుగా ఉచితంగా పుస్తె మెట్టెలు అందజేస్తున్న సేవా రత్న అవార్డు గ్రహీత, టీఆర్ఎస్ పార్టీ మండల కోశాధికారి బండారి సంతోష గంగాధర్ ఉదార స్వభావమిది. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన బండారి గంగాధర్ దంపతులు ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేయడమే కాకుండా దైవ కార్యక్రమాలకు తన వంతుగా విరాళాలు అందిస్తుండటం పట్ల గంగాధర్ దంపతులను పలువురు అభినందిస్తున్నారు. జిల్లాలోని ఏ గ్రామంలోనైనా పేద ఆడిబిడ్డల వివాహానికి అవసరం ఉన్నట్లు తెలిసిన వెంటనే అప్పటికప్పుడు పుస్తె మెట్టెలు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు లక్షలాది రూపాయలు వచ్చిస్తూ పుస్తె మెట్టెలు చేయించి బహుమానంగా ఇస్తున్నట్లు తెలుస్తుంది.

ఆర్థిక సహాయం అందజేసిన చిన్ననాటి మిత్రులు

శివ్వంపేట, డిసెంబర్17 ప్రభాతవార్త: చిన్ననాడే కాదు.. ఉన్నన్నినాళ్లు ఒకరి బాధలను మరొకరం పంచుకొని సాధకబాధకాలలో అందరం పాలుపంచుకుందామని, ఆదపలో ఉన్న స్నేహితులందరికీ బాసటగా ఉంటూ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని పిల్లుట్ల ఉన్నత పాఠశాల 2002-03 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పిల్లుట్ల గ్రామానికి చెందిన జోగు మహేష్ తన పేదరికం కారణంగా చిన్న అమ్మమ్మ ఊరైన చేగుంట మండలం పెద్దశివనూర్ గ్రామానికి బ్రుతుకు దెరువుకై వెళ్లి అక్కడ అనారోగ్యానికి గురై తనపై ఆధారపడ్డ కుటుంబానికి పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తనతో టెన్త్ క్లాస్ చదువుకున్న తోటి విద్యార్థులకు వాట్సాప్ గ్రూప్‌లో మెుర పెట్టుకోగా వెంటనే స్పందించిన టెన్త్ క్లాస్ బ్యాచ్ విద్యార్థులు పెద్దశివనూర్ గ్రామానికి చెందిన జోగు మహేష్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. జోగు మహేష్ కుటుంబానికి ప్రభుత్వం నుండి డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు మెగావత్ రవి, ముత్యాలు, శ్రీనివాస్, మధు, పాండరిగౌడ్, కరుణాకర్‌రెడ్డి, ప్రభుదాస్, కృష్ణవేణి, నర్సింలు, నాగేందర్, హనుమంతు, మల్లేష్, శ్రీనివాస్, కుమార్, నరేందర్, సరిత, హేమలత, శ్రీనివాస్, రజిత, నర్సింలు, శేఖర్‌రెడ్డి, ప్రవీణ్, సందీప్, మహేష్, రాజు, శ్రీనివాస్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి, డిసెంబర్17 ప్రభాతవార్త: మండల పరిధిలోని బస్వాపూర్ వద్ద వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం ఆయ్యప్ప మాల ధరించిన భక్తులు మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి పద్దెనిమిది మెట్లను ఏర్పాటు చేసి మెట్టుమెట్టుకు పండ్లు, పూలు, కుంకుమ, దీపాలతో అలంకరించారు. అనంతరం పరిసర ప్రాంత అయ్యప్ప మాలాధారణ భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు కీర్తనలతో హోరెత్తించారు. అయ్యప్ప స్వామి స్మరణతో ఆ ప్రాంతంమంతా మోరుమ్రోగింది. అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులు కఠోర దీక్షతో చలిలో సైతం ఉంటూ పూజలు నిర్వహిస్తున్నారు. కఠోర దీక్షలో ఉన్న స్వాములు పూజల్లో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి స్వామి, మల్లేశం స్వామి, రవీందర్, రాజు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం

వెల్దుర్తి, డిసెంబర్17 ప్రభాతవార్త: మండల పరిధిలోని మంగళపర్తి గ్రామంలో శనివారం అదే గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం, లక్ష్మిల కూతురు వివాహం జరిగింది. ఈ వివాహానికి సర్పంచి రామకృష్ణారావు రూ.5,116 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ వివాహ వేడుకల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన చేతుల మీదుగా ఆర్‌కే కిట్‌ను అందజేశారు. కాగా సర్పంచి రామకృష్ణారావు ఇప్పటి వరకు 48 పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, శివ్వంపేట ఎంపీపీ హరికృష్ణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, భూమయ్య, రామచందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఈకెవైసీ నమోదు చేయించుకుంటున్న రైతు

పిఎం కిసాన్ లబ్దిదారులందరూ ఈకైవైసీ చేయించుకోవాలి

రామాయంపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త ః పిఎం కిసాన్ లబ్దిదారులందరూ తప్పకుండా ఈకైవైసీ చేయించుకోవాలని రామాయంపేట మండల వ్యవసాయశాఖ అధికారి రాజ్‌నారాయణ సూచించారు. మండల వ్యాప్తంగా పిఎం కిసాన్ లబ్దిదారులు 6851 కిగాను ఇప్పటివరకు 5621 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవడం జరిగిందన్నారు. ఇంకా మండల వ్యాప్తంగా 1200 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదని తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు 13వ విడత పిఎం కిసాన్ నిధులు అందే అవకాశం లేదని, చాలామంది రైతులు 11వ విడత, 12వ విడత డబ్బులు పడ్డాయి కాబట్టి ఈకేవైసీ తప్పనిసరి కాదని రైతులు అపోహపడుతున్నారన్నారు. 11, మరియు 12వ విడత పిఎం కిసాన్ నిధులు పొంది వ్యవసాయ విస్తీర్ణఅధికారుల వద్ద ఈకేవైసీ చేయించుకోని రైతుల జాబితాలో పేరు ఉన్నట్టయితే తప్పనిసరిగా మీసేవా లేదా కామన్ సర్వీస్ సెం టర్ లేదా పోస్ట్‌ఆఫీస్‌లో ఈకేఈఐసీ చేయించుకోవాల్సి ఉంటుం దన్నారు. అదే విధంగా అతి సులభంగా తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లోనే రెండు నుంచి మూడు నిమిషాల వ్యవధిలో ఈకేవైసీ ని అప్డేట్ చేసుకునే అవకాశం ఉంది కావున రైతులు వెంటనే చేయించుకోవాల్సిందిగా తెలిపారు. మరిన్నీ వివరాలకు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారిని లేదా మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్యాలయంలో మీసేవా ప్రతినిధితో కలిసి రైతుల కు వేలిముద్రల ద్వారా ఈకేవైసీ అప్డేట్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాజు మరియు రైతులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం

రామాయంపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త ః సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు అయ్యాక చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ, కొమురం భీమ్ లాంటి మహానుభావుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదే విధంగా భారతదేశ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని కూడా అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చేనెల జనవరి మూడవ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొని అధికారికంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజా సంఘాలు, బీసీ సంఘాలు ఈ దిశగా అందరూ పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా సహకరించాలని ఆయన కోరారు.

నిరుపేద మహిళ వివాహానికి ఆర్థిక సహాయం

వధువుకు ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

రామాయంపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త ః రామాయంపేట పట్టణానికి చెందిన నిరుపేద మహిళ వివాహానికి బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, నాలుగో వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. పట్టణానికి చెందిన పుట్టి సత్తవ్వ, నడిపి స్వామి దంపతుల కూతురు పుట్టి స్వప్న వివాహానికి ఆయన తన వంతుగా సహాయం చేసినట్లు తెలిపారు. కాగా స్వప్న తండ్రి పుట్టి నడిపి స్వామి కొన్ని నెలల క్రితం మరణించడం జరిగిందని, స్వప్న వివాహం సోమవారం జరుగుతున్న విషయం తెలుసుకున్న నాగరాజు ఈ ఆర్థిక సహాయాన్ని అందించార

ఎల్ఓసిని అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే

న్యాల్‌కల్, డిసెంబరు 17, ప్రభాతవార్త: అనారోగ్యంతో అవస్థలు పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఎంతగానో ఉపయోగపడు తున్నాయని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మండలంలోని గంగ్వార్ గ్రామానికి చెందిన శామన్న అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన చికి త్స అందుకునేందుకు గాను శాసన సభ్యులు మాణిక్‌రావు గ్రామస్థుల కోరిక మేరకు ముఖ్యమంత్రి సహాయనిధిలో నిధులను మంజూరు చేయించారు. బాధిడు తు మెరుగైన చికిత్సను అందుకునేందుకు గాను 2లక్షల 50వేల రూపాయలను ఎమ్మెల్యే మంజూరు చేయించి శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు. పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు, ఎల్ఓసిని అందించిన ఎమ్మెల్యేకు, అందుకు కృషి చేసిన నాయకులకు శామన్న కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖేడ్‌లో సేమి క్రిస్మస్ వేడుకలు

నారాయణఖేడ్, డిసెంబర్ 17 ప్రభాతవార్త: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నారాయణఖేడ్ మండల పరిధిలోని జూజల్‌పూర్ వద్ద గల హెచ్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం ఆరు గంటలకు ప్రభుత్వం తరపున నిర్వహించే సేమీ క్రిస్‌మస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరవుతున్నట్లు క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు. అందుకు నియోజకవర్గంలోని ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

జహీరాబాద్‌లో గ్రాండ్‌గా క్రిస్మస్ సెలబ్రేషన్స్

-కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

క్రిస్మస్ సెలబ్రేషన్స్‌లో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త: జహీరాబాద్ పట్టణంలో క్రిస్మస్ సెలబ్రేషన్స్ గ్రాండ్‌గా నిర్వహించుకున్నారు. ముందస్తు క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కేక్‌ను శుక్రవారం రాత్రికి జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావు కట్ చేసి సంబురాలు ప్రారంభించారు. క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఆట పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. సల్వడీ ప్రొడక్షన్ హైద్రాబాద్ బృందం ఆలపించిన క్రీస్తు ఆరాధన మకప్‌సాంగ్స్, క్రైస్తవ కీర్తనలు చూపరులను ఆకట్టుకున్నాయి. క్యాడిల్ లైట్స్, కేక్ కటింగ్, చిన్న పిల్లల స్కట్స్ కార్యక్రమాలు సభికులను ఆనందింపచేశాయ. డిఎస్ జాన్ వెస్లీ, ప్రశాంత్‌లు క్రీస్తు జన్మదిన విశిష్టతను తెలియచేశారు. కార్యక్రమంలో డిఎస్ జాన్‌వెస్లీ, ఇండిపెండెంట్స్ పాస్టర్స్ ప్రిసిడెంట్స్ రాజేందర్, పాసర్ట మోజెస్స్, ప్రశాంత్, క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు వివప్ప, సభ్యులు స్టాలిన్, యూదా, ప్రవీణ్, మార్క్, నాథన్, లవన్, జనార్ధన్, నాయకులు ఇజ్రాయిల్ బాబి, బండి మోహన్, మోహియోద్దిన్, యూసూఫ్, రామకృష్ణ బంటు, మూర్తుజా తదితరులు పాల్గొన్నారు.

మహాసభల ముగింపు సభను జయప్రదం చేయాలి

పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కొల్చారం, డిసెంబర్17 ప్రభాతవార్త: డిసెంబర్ 23వ తేదీన సిద్దిపేటలో నిర్వహించే సీఐటీయూ రాష్ట్ర 4వ మహాసభల ముగింపు సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె. నర్సమ్మ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన కొల్చారంలో బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 21, 22, 23వ తేదీలలో సిద్ధిపేటలో సీఐటీయూ రాష్ట్ర 4వ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా సీఐటీయూ చేసిన పోరాటాలు, ఉద్యమ ఫలితాలను చర్చించుకొని లోపాలను సరి చేసుకొని భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలను ఈ మహాసభల్లో రూపొందించుకుంటామని ఆమె అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసుకోవడానికి, కార్మిక హక్కుల సాధన కోసం ఏ విధమైన పోరాటాలు నిర్వహించాలనే విషయాలను చర్చిస్తామన్నారు. ఈ బహిరంగ సభకు కేరళ మంత్రి హాజరవుతారని, మూడు రోజుల పాటు జరిగిన చర్చలు, నిర్ణయాలు, తీర్మాణాలు బహిరంగ సభలో తెలియజేస్తామని అన్నారు. ఈ మహాసభకు జిల్లాలోన అన్ని రంగాల కిర్మాకులు 23వ తేదీన మధ్యాహ్నం 1.00 గంటల వరకు సిద్ధిపేట బహిరంగ సభకు హాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు. శ్రీనివాస్, యాదల్, రాజు, స్వామి, హన్యయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపనలు

హుస్నాబాద్,డిసెంబర్17,ప్రభాతవార్త హుస్నాబాద్ పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి సోమవారం హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ పాల్గొని శంఖుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వమించనున్నట్లు హుస్నాబాద్ పట్టణ మున్సిపల్ కమిషనర్ సుంకె రాజమల్లయ్య తెలిపారు.సోమవారం నాడు పట్టణంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయంలోని అనివేటి మండపంకు 10.15కు శంఖుస్థాపన చేసిన అనంతరం దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన పబ్లిక్‌టాయిలెట్‌ను ప్రారంభిస్తారని చెప్పారు.11.15కు ఓపెన్‌జిమ్‌ను ఎల్లమ్మ చెరువు సమీపంలో ప్రారంభం ఉంటుందని అనంతరం హరితమారం నర్సరీ ప్రారంభోత్సవం 12గంటలకు అయ్యప్ప దేవాలయంలో కమ్యూనిటీ మాలును ప్రారంభిస్తారని చెప్పారు.అనంతరం అయ్యప్ప దేవాలయం లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

గుప్పెడు బాదములతో క్రిస్మస్ వేడుక

నిస్పందేహంగా సంవత్సరంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే వేడుకలలో కిస్మస్ ఒకటి. డిసెంబర్ నెల రావడంతో క్రిస్మస్ ట్రీలు, జింగిల్ బెల్స్ కారోలింగ్ కాయిర్స్ సిక్రెట్ శాంతాలకు కూడా సమయం ఆసన్నమైంది. ఆత్మీ సమాశేలు, డిన్నర్ పార్టీలు, హాలీడేస్, బహుమ తులు మొదలు పెడితే ప్రతి ఒక్కరికీ ఒకటి ఈ సీజన్లో వాతారవణానికి మరింత ఆనందం జోడిస్తూ ఇది మరింత ఆనందం కలిగించనుంది. ఎన్నో కారణాల చేత క్రిస్మస్ ఉత్సాహపూరితంగా ఉంటుంది. అత్యంత రుచి కరమైన ఆహారం కోసం ఈ సీజన్లో మనమంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తుంటాము. ఈ సంవత్సరం ఆహారంను అప్రమప్తంగా ఎం చుకోండి మరియు ఆరోగ్యవంతమైన క్రిస్మస్‌ను ఆస్వాదించండి. బాద ములు, చక్కటి ఆరోగ్యానికి అద్భుతమైన బహుమతిగా నిలుస్తాయి. వీటిని మీకు మీరు బహుమతిగా అందించుకోవచ్చు.

క్రీడల్లో ప్రతిభ చాటిన వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థుల దృశ్యం

క్రీడలో వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభ

కంది, డిసెంబరు 17, ప్రభాతవార్త: క్రీడా పోటీల్లో వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించ అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్, కల్చరల్, లిటరరీ మీట్ 2022-23లో జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన అగ్రికల్చర్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. క్రికెట్, టేబుల్ టెన్నిస్, లాంగ్ జంప్, షాట్‌పుట్, వ్యాస రచన తదితర పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఆయా పోటీల్లో మొదటి బహుమతులును కైవశం చేసుకున్నారని కళాశాల డీన్ డాక్టర్ కే శ్రీనివాస్ కుమార్ పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కళాశాల ప్రొఫెసర్లు, పిడి మల్లికార్జున్, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

తెలంగాణ చరిత్రను అధ్యాయనం చేయండి

-విద్యార్థులతో తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ

మన ఊరు మన చరిత్రపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 17, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో మరుగున పడిన, మారు మూల ప్రాంతాల చరిత్రను అధ్యాయనం చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా డిగ్రీ కళాశాల(ఏ) ప్రిన్సిపాల్ యుప్రవీణ సూచించారు. శనివారం కళాశాలలోమన ఊరు-మన చరిత్ర కార్యక్రమంపై కళాశాలలో విద్యను ఆర్జిస్తున్న బికాం, బిఏ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభత్వ ఉన్నత విద్యా శాఖ ప్రతిష్టాత్మకంగా మన ఊరు మన చరిత్ర కార్యక్రమం నిర్వహిస్తోందని గుర్తు చేశారు. మరుగున పడిఉన్న రాష్ట్ర చరిత్ర, పురాతన కాలం నుంచి ఆర్థిక, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, వాణిజ్యం లాంటి అంశాలు సమగ్రంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని చరిత్రను తెలుసుకోవాలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, సామాజిక శాస్త్రాలఅధ్యాపకులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ జ్యోత్స్న, వాణిజ్య శాస్త్ర అధిపతి వి సంతోషి, అధాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎస్ నకారా కృషితోనే సుప్రీం తీర్పు

హుస్నాబాద్,డిసెంబరు17,ప్రభాతవార్త

డిఎస్ నకారా కృషితోనే సుప్రీం కోర్టులో పెన్షనర్లకు అనుకూలంగా ప్రోత్సహం ఇచ్చేలా తీర్పువచ్చింది హుస్నాబాద్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తక్కళ్ళపల్లి రాజ్‌గోపాల్‌రావు కొనియాడారు.శనివారం నాగు పట్టణంలోని వారి సంఘ భవనంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించగా దాదాపు 60 మంది సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇ వెంటనారాయణ,కన్నోజు సత్యనారాయణ,చీకోటి లక్ష్మినారాయణ,దేవులపల్లి ఉషారాణిలను ఘనంగా సన్మానించారు .అనంతరం భవన నిర్మాణానికి గాను సభ్యులు విరాళాలను అందచేసారు. తక్కళ్ళపల్లి రాజ్‌గోపాల్‌రావు, సత్యనారాయణరెడ్డి,కృష్ణమూర్తి,వరయోగుల సుదర్శనస్వామి, గాదర్ల మోహన్ తదితరులున్నారు.

గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలి

చిన్నశంకరంపేట,డిసెంబర్ 17, ప్రభాతవార్త: గర్భిణీలు పోషక పదార్థాలు తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీశైల తెలిపారు. శనివారం చిన్నశంకరంపేట పట్టణంలో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలను తల్లులు జాగ్రత్తగా చూసుకోవాలని, వారికి తగిన పోషకాహారం అందేలా చూడాలన్నారు. గర్భిణీలకు పిల్లలకు ఎలాంటి పోషకాహారం అందించాలో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోషన్ అభియాన్ కో-ఆర్డినేటర్ శోభా, శ్యామల, వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలలకు పంపించాలి

చిన్నశంకరంపేట,డిసెంబర్ 16, ప్రభాతవార్త: విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని చిన్నశంకరంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రం తల్లితండ్రులకు సూచించారు. శనివారం చిన్నశంకరంపేట పట్టణంలోని జడ్పీ పాఠశాలలో తల్లితండ్రులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, తల్లితండ్రులు కూడ సహకరించి విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. మద్యాహ్నా బోజనం, ఉపాధ్యాయుల పాఠ్యాంశాల తీరుపై తల్లితండ్రులతో చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, రాజ్‌కుమార్, శ్రీకాంత్, నాగరాజు, విద్యాకమిటి చైర్మన్ అశోక్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

అదనపు కలెక్టర్ రాజర్షి షా

సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 17, ప్రభాతవార్త:

జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని అదనపు కలెక్టర్ రాజర్షి షా బ్యాంకర్లను కోరారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రైతులకు పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాల, రికవరీ, పీఎం, జిపివై, రుణాలు, ఎస్సీ, బిసి, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్యపురోగతిపై డిసిసి డిఎల్ఆర్‌సి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజర్షి షా మాట్లాడుతూ వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వందశాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులు తమ రుణాలను రెవెన్యూవల్ చేసుకునే అంశంపై వారికి అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాం పులు నిర్వహించాలని తెలిపారు. రైతుబంధు, రైతుభీమా, ప్రధానమంత్రి కిసాన్, సమ్మాన్ నిధులను పంట రుణాలకు జమ చేసుకోవడానికి వీలు లేదని, సదరు నియమాలను బ్యాంకర్లు తప్పనిసరిగా పాటించాలని రాజర్షి సూచించారు. పంటరుణాలు 1473 కోట్లు లక్ష్యంగా కాగా, 1393 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ 605 కోట్లు, మెప్మా కింద 858 స్వయం సహాయక సంఘాలకు రూ. 73 కోట్ల రుణాలు అందించామని అధికారులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 64.52 శాతం పూర్తయిందని, పెండింగ్‌లో ఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాజర్షి ఆదేశించారు. వివిధ పథకాలలో రుణాలు మంజూరి అయిన లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల తిరిగి సకాలంలో బ్యాంకులకు చెల్లించేలా ఆయా శాఖల అధికారులు, జిల్లాలో రుణాల రికవరీపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని బ్యాంకర్లను సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి స్వానిధి కింద రెండవ సారి రుణం దరఖాస్తు చేసుకున్న వారి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. అనంతరం నాబార్డ్‌కు సంబంధించిన 2023-24 జిల్లా ప్రొటేన్షియల్ లింక్డ్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమవేశంలో ఎల్‌డిఎం గోపాల్‌రరెడ్డి, ఆర్బిఎం, ఏజిఎం ఆలీబాబా, జిల్లా వ్యవసాయ, పశుసం వర్ధక, పరిశ్రమలు, జిల్లా గ్రామీణ అభివృద్ధి, మెప్మా, సంక్షేమ శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సామాగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

జీవిత లక్ష్యాన్ని విద్యార్థులు నిర్ధారించుకోవాలి: రేనీ గ్రేస్

నారాయణఖేడ్, డిసెంబర్ 17 ప్రభాతవార్త: నేటి కంప్యూటర్ యూగంలో ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యాన్ని రూపొందించుకోని చక్కటి ప్రణాళికతో విద్యను కొనసాగించాలని డిగ్నిటీ డ్రైవ్ వ్యవస్థాపకులు రేనీ గ్రేస్ అన్నారు. శనివారం నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు డిగ్నిటీ డ్రైవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల లోని 157 మంది విద్యార్థులకు సుమారు రూ.లక్ష విలువ గల స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, విద్యార్థినీలకు ప్రత్యేకంగా వివిధ వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నిరుపేద విద్యార్థులు చదువుతారని వారికి దాతల సహకారంతో విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రవాసభారతీయుల సహకారంతో ఈ బ్యాగులు నోట్ పుస్తకాలు అందించనన్నారు. లర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కౌముది నాగరాజు సహకారంతో కూడా సామాగ్రిని అందించామ న్నారు. ఒక ఆదర్శ పాఠశాలగా ర్యాకల్ ఉన్నత పాఠశాలకు గుర్తింపు పొందేలా మరింత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ఆచార్య, సర్పంచ్ సుజాతరెడ్డి, లర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోమ్మది నాగరాజు, డిగ్నిటీ డ్రైవర్ ఫౌం డేషన్ సభ్యులు విక్రమ్ ప్రవీన్, ఉపాధ్యాయులు నర్సింలు, హన్మాండ్లు, దత్తు, లక్ష్మన్, పాండు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్సాపూర్,,డిసెంబర్ 17 .ప్రభాతవార్త: రెండు కార్లు ఢీ కొనగా ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ హైద్రాబాద్ ప్రధాన రోడ్డులోని అడివి ప్రాంతంలో కొండాపూర్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఎస్ఐ గంగరాజు కథనం ప్రకారం ఇలా వున్నాయి.మియాపూర్ సమీపంలోని మల్లంపేటలో నివాసముంటున్న కునూవత్ రాజారామ్ (40) బట్టల వ్యాపారం చేస్తు జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కాగా ఈ రాజారామ్ కొన్ని రోజుల క్రితం మెదక్ సమీపంలోని అవుసులపల్లి గ్రామంలో కిరాణం షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే మల్లంపేట నుండి ప్రతి రోజు అవుసులపల్లికి వస్తుపోతుండే వాడని చెప్పారు. కాగా రోజు మాదిరిగానే శనివారం కూడ మల్లంపేట నుండి అవుసులపల్లి కి తన కారులో వెళుతున్నట్లు తెలిపారు. రాజారామ్ కారులో వెళుతున్నా క్రమంలోఅడవి ప్రాంతంలోని కొండాపూర్ సమీపంలోకి రాగానే ఎదురుగా ఒక ఇన్నోవా కారు అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ రాజారామ్ కారును ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో రాజారామ్ కు తలకు ఇతర బాగాలను బలమైన రక్తగాయాలు అవ్వగా అక్కడికక్కడే రాజారామ్ మృతి చెందినట్లు తెలిపారు ఇన్నోవా కారు డ్రైవర్ అజాగ్రత్తగా కారును నడపడం వల్లనే మాఅన్నయ్య మృతి చెందాడని అతని పై చర్యలు తీసుకోవాలని మృతుడి తమ్ముడు మాణిక్‌చెంద్ కోరారు. మృతుడి తమ్ముడు మాణిక్‌చెంద్ పిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



భాగ్యనగరంలో ఎమ్మెల్యేను కలిసిన ధర్పల్లి గ్రామస్తులు

చిన్నశంకరంపేట,డిసెంబర్ 17, ప్రభాతవార్త: గ్రామాలలో నెలకోన్న సమస్యలను పరిష్కరించేందకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు ఆధ్వర్యంలో ధర్పల్లి గ్రామ సర్పంచి సిద్దిరాంరెడ్డి, గ్రామస్తులు శనివారం భాగ్యనగరంలోని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని తన నివాసంలో కలిశారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, మహేష్, కుమ్మరి ప్రవీణ్, కృష్ణ, ఆంజనేయులు, మణీ, రవి, మాదారం, మల్లేష్, గోవర్ధన్, మైపాల్, సత్తయ్య, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

జల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

ఆలయంలోశ్రీజలాంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

నర్సాపూర్,,డిసెంబర్ 17 .ప్రభాతవార్త: నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన జలహనుమాన్ ఆలయంలో శనివారం పురస్కరించుకొని శ్రీజలాంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు భక్తులు భక్తి శ్రద్ధలతో నియమ నిష్ఠలతో పూజలు నర్సాపూర్ పట్టణానికి చెందిన కేసరియా గోల్డ్ షాప్ నిర్వాహకులు మరియు గణేశ్ రెడిమెడ్ షాప్ నిర్వహకుల అధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన జలాంజనేయస్వామికి జలాబిషేకం,పంచామృతాబిషేకం, చందన లేపనం, వంటి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈమేరకు మధ్యాహ్నం దాతలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలోఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళు, ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

19న తాలూకా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

నర్సాపూర్,డిసెంబర్ 17 .ప్రభాతవార్త

ఈ నెల 19 వ తేదీనా శివ్వంపేట మాజీ జడ్‌పిటిసీ స్వర్గీయ లక్ష్మారెడ్డి 60 వ జయంతిని పురస్కరించుకొని తాలూకా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీలనుఈ నెల 19 న మధ్యాహ్నం 2 గంటలకు బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంబించనున్న ట్లు తెలిపారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి లు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు.ఈ వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతానికి నియోజకవర్గంలోని వాలీబాల్ క్రీడాకారులతో పాటు క్రీడాబిమానులు, టిఆర్ఎస్ నాయకులు, లక్ష్మారెడ్డి అబిమానులు అధిక సంఖ్యలో తరిలి వచ్చి విజయ వంతం చేయాలని ఆమె కోరారు.

30 ఏళ్ల వేడుక చేసుకుంటున్న వోల్టర్స్ క్లూవెర్

వోల్టర్స్ క్లూవెర్ ఆప్ టుడేట్ 30 సంవత్సరాలను పూర్తి చేసుకుంది. అందువల్ల వేడుకచేసుకుంటుంది. ఈ సందర్భంగా వోల్టర్స్ క్లూవెర్ హెల్త్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ పీటర్ బోనిస్ ఎండీ మాట్లాడుతూ 30 ఏళ్లు గా క్లిష్టమైన ముఖ్యమైన ప్రశ్నలకు అప్‌టుడేట్ సాక్ష్యాధారిత సమా ధా నాలను అందించిం దన్నారు. అత్యవసర సమయంలో సరైన పరిష్కారం పొందాలంటే తపన మన సంస్కృతికి ప్రధానమైనదన్నారు.వోల్టర్స్ క్లూవెర్ క్లినికల్ ఎఫెక్టివ్‌నెస్ విభాగంలో భారతదేశం సార్క్ కంట్రీ హెడ్ హరీష్ రామచంద్రన్ మాట్లాడారు.

భాజాపా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయశాంతి

పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన విజయశాంతి

చిన్నశంకరంపేట,డిసెంబర్ 17, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలో చ్చిన బిజెపి అధికారంలోకి రావడం ఖాయం అని మెదక్ మాజీ ఎంపీ, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు బిఆర్ఎస్ పాలనతో విసిగిపోయారని, రాష్ట్రంలోని ప్రజలు బిజెపి వైపు ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో దోచుకున్నది సరిపోక, దేశాన్ని దోచుకోవడానికి ఢిల్లికి వెళ్లాడని అన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు మల్లారెడ్డి, తాళ్లపల్లి రాజశేఖర్, నందారెడ్డి, మండల అధ్యక్షుడు పోగుల రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్‌ను తనిఖీ చ